సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



నేతల అడ్డా..
తాడ్వాయి మండలానికి చెందిన పలువురు నేతలు జిల్లా రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.

- IIలో ▸



అభివృద్ధి చేసి ఓట్లడుగుతున్నా
నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మరోసారి గెలిపించాలని కోరుతున్నానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /19.9

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు అమిత్‌షా రాక



పెర్కిట్(ఆర్మూర్): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శుక్రవారం ఆర్మూర్‌కు రానున్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారని బీజేపీ నాయకులు తెలిపారు.

ఎల్లారెడ్డికి మంత్రి హరీశ్‌రావు..
ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో శుక్రవారం నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బంజారా భవన్ వరకు రోడ్ షో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం గాంధీచౌక్‌లో నిర్వహించే సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



తాడ్వాయి: మండల కేంద్రంతోపాటు కృష్ణాజీవాడి, ఎర్రాపహాడ్ తదితర గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను గురువారం సాధారణ ఎన్నికల పరిశీలకుడు జగదీష్ సందర్శించారు. పోలింగ్ బూత్‌లలో వసతులను పరిశీలించారు. భద్రత వివరాలను తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లలో సరైన వసతులు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సునీత ఉన్నారు.

రేపు పీజీ స్పాట్ అడ్మిషన్లు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పీజీ కోర్సుల్లో ఖాళీల భర్తీ కోసం శనివారం ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. కళాశాల సెమినార్ హాల్‌లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం మెరిట్ ప్రాతిపదికన తక్షణ ప్రవేశాలుంటాయని పేర్కొన్నారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎమ్మెస్సీ బాటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ కోర్సుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఏఎంసీ చైర్మన్ పదవికి రాజీనామా



మద్నూర్: మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు సంగమేశ్వర్ ప్రకటించారు. గురువారం ఆయన మద్నూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో రాజకీయాలను వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీని కొంత మంది వ్యాపారులే శాసిస్తున్నారన్నారు. పదవికోసం వ్యాపారం చేయలేనన్నారు. బీఆర్‌ఎస్‌లో సామాన్య కార్యకర్తగా పనిచేస్తానన్నారు.

రాష్ట్రంలో బీజేపీ గెలుపు పక్కా




గాంధారి: తెలంగాణలో బీజేపీ గెలవడం ఖాయమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. గురువారం ఆయన గాంధారిలో పార్టీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి మద్దతుగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం మొత్తం అవినీతికి పాల్పడుతూ రాష్ట్రాన్ని దోచుకుంటోందన్నారు. మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం నయా పైసా కూడా అవినీతి చేస్తలేదన్నారు. ఓవైపు మోదీ పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుండగా మరోవైపు కేసీఆర్ రేషన్ కార్డులు ఇవ్వడం లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు కోవర్ట్ అని ఆరోపించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసిన సుభాష్‌రెడ్డినే మోసం చేసిన రేవంత్‌రెడ్డి.. ప్రజలను మోసం చేయడని గ్యారంటీ ఏముందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయడం ఏమోగాని ప్రజలను మోసం చేయడం మాత్రం పక్కా అన్నారు. నీతివంతమైన పాలన కోసం ప్రజలు బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు.. అంత వీజీ కాదు!

- నాలుగు చోట్లా ముక్కోణపు పోరే..
- కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌లను సవాల్ చేస్తున్న కేవీఆర్
- బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్‌లలోనూ హోరాహోరీ..
- రసవత్తరంగా అసెంబ్లీ ఎన్నికలు

పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అన్నిచోట్లా ముక్కోణపు పోటీ నెలకొనడంతో ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థికీ గెలుపు అంత సులువుగా దక్కే సూచనలు కనిపించడం లేదు. దీంతో గెలుపుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎప్పటికప్పుడు వ్యూహాలకు పదునుపెడుతున్నారు. త్రిముఖ పోరులో ఎవరిది పైచేయి అవుతుందన్న దానిపై జిల్లా అంతటా జోరుగా చర్చలు నడుస్తున్నాయి.

– సాక్షి, కామారెడ్డి



అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. పోలింగ్‌కు గడువు సమీపిస్తుండడంతో అభ్యర్థులు, పార్టీలు ప్రచార జోరు మరింత పెంచాయి. ఆయా పార్టీలు నిర్వహించే ప్రచారానికి, సభలకు జనం భారీగానే వస్తున్నారు. దీంతో అందరిలోనూ గెలుపు ధీమా కనిపిస్తోంది. అయితే జిల్లాలో నాలుగు నియోజకవర్గాలుండగా.. అన్ని చోట్లా ముక్కోణపు పోటీనే కనిపిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది.

కామారెడ్డిలో..
సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంనుంచే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. ఇక్కడ బీజేపీ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి బరిలో ఉన్నారు. ఇద్దరు ఉద్దండులతో సై అంటే సై అంటూ ప్రచారంలో దూసుకుపోతున్న వెంకటరమణారెడ్డి ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షించారు. ముక్కోణపు పోరులో గెలుపు కోసం అన్ని పార్టీలూ శ్రమిస్తున్నాయి. సీఎం కేసీఆర్ తరపున ఆయన తనయుడు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పలు సభలు, రోడ్‌షోలలో పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు, కార్పొరేషన్ల చైర్మన్లు పలువురు కులాల వారీగా సమావేశాలు నిర్వహించి కేసీఆర్‌కు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తోపాటు ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి స్థానికంగా ఉండి మంత్రాంగం నడుపుతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వీలు చిక్కినప్పుడల్లా రోడ్‌షోలు, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఈనెల 26న కామారెడ్డిలో నిర్వహించే ప్రచార సభలో ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ పాల్గొననున్నారు. రేవంత్‌రెడ్డి సోదరులు ఇక్కడే మకాం వేసి గెలుపుకోసం చక్రం తిప్పుతున్నారు.

బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి సైతం విజయంపై ధీమాతో ఉన్నారు. తాను సొంత డబ్బులతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై నిర్వహించిన ఆందోళనలు, దానికి తోడు వివిధ వర్గాలతో ఉన్న అనుబంధం తనకు కలిసివస్తుందన్న ధీమాతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆయనకు మద్దతుగా 25న కామారెడ్డిలో నిర్వహించే సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొననున్నారు.

ఎల్లారెడ్డిలో..
ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పోటీ చేస్తుండగా కాంగ్రెస్‌నుంచి మదన్‌మోహన్‌రావు, బీజేపీనుంచి సుభాష్‌రెడ్డి తలపడుతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే కొందరు నేతలు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరడం ఆ పార్టీకి కొంతమేర నష్టం చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు విస్తృతంగా ప్రచారం చేస్తూనే బీఆర్‌ఎస్ నేతలను పార్టీలో చేర్చుకోవడంపై దృష్టి సారించారు. పలువురు ప్రజాప్రతినిధులను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి నియోజకవర్గం అంతటా తిరుగుతూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. తాము చేసిన సేవా కార్యక్రమాలే గెలిపిస్తాయన్న ధీమాతో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులున్నారు.

జుక్కల్‌లో...
జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్ సింధేతో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంత్‌రావ్, బీజేపీ అభ్యర్థి అరుణతార తలపడుతున్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్‌కు బలమైన కేడర్ ఉంది. నిత్యం ప్రజల్లో ఉన్న సింధే తన గెలుపును ఎవరూ అడ్డుకోలేరన్న ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్‌కు ఉన్న బలమైన ఓటు బ్యాంకుతోపాటు ఆరు గ్యారంటీ పథకాలను నమ్ముకుని ఆ పార్టీ అభ్యర్థి లక్ష్మీకాంత్‌రావ్ ముందుకు సాగుతున్నారు. ఇక్కడ టికెట్టు కోసం చివరిదాకా ప్రయత్నించి విఫలమైన మాజీ ఎమ్మెల్యే గంగారాం సహకరించడం లేదని తెలుస్తోంది. బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే అరుణతారకు నియోజకవర్గంలో మంచి పేరుంది. ఇటీవల బీజేపీ నేత బండి సంజయ్‌తో రోడ్‌షో నిర్వహించారు. అలాగే ఈటల రాజేందర్‌తో కూడా రోడ్‌షో నిర్వహిస్తున్నారు. గతంలో తాను చేసిన అభివృద్ధే గెలిపిస్తుందన్న ధీమాతో అరుణతార ఉన్నారు.

బాన్సువాడలో..
బీఆర్‌ఎస్ సీనియర్ నేత, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ నుంచి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా.. కాంగ్రెస్‌నుంచి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి బరిలో ఉండగా.. బీజేపీ అభ్యర్థిగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో గట్టి పట్టున్న పోచారం ఈసారి కూడా విజయం సాధించాలన్న పట్టుదలతో జోరుగా ప్రచారం చేస్తున్నారు. పోచారం తనయులు ప్రచారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రవీందర్‌రెడ్డి తనకున్న పరిచయాలు, కాంగ్రెస్ క్యాడర్ సహకారంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. చివరి నిమిషంలో టికెట్టు దక్కించుకున్నా గట్టిపోటీ ఇస్తున్నారు. బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం ఉన్న వారు, హిందుత్వ భావజాలం కలిగిన వారితో పాటు బీజేపీ శ్రేణులను కలుపుకుని ముమ్మర ప్రచారం చేస్తున్నారు.

కుటుంబ పాలనను అంతం చేద్దాం



నిజామాబాద్ సభలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అర్బన్ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రూరల్ అభ్యర్థి కులాచారి దినేశ్, జిల్లాధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య

- 30 తర్వాత కేసీఆర్ ఫాంహౌజ్‌కే పరిమితం
- కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేయడం లేదు
- కేసీఆర్ అవినీతిపై విచారణ చేపడుతాం
- వరి క్వింటాలుకు రూ.3100 చెల్లిస్తాం..
- సకల జనుల విజయ సంకల్ప సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

సుభాష్‌నగర్: నవంబర్ 30 తర్వాత సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు ఫాంహౌజ్‌కే పరిమితం చేస్తారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, కుటుంబ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గురువారం నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి సకల జనుల సంకల్ప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ నడ్డా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనను డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకంగా మార్చారన్నారు.

- అమరవీరుల కుటుంబాలను సీఎం కేసీఆర్ పట్టించుకోలేదని, వారి త్యాగాలపై ఏర్పడిన రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని నడ్డా ఆరోపించారు. ప్రధాని మోదీ గ్యారెంటీ పథకాలపై ప్రజలు నమ్మకం ఏర్పర్చుకోవాలని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.
- బీజేపీ అధికారంలోకి వస్తే డీజిల్, పెట్రోల్‌పై వ్యాట్ తగ్గిస్తామని, తెల్లరేషన్‌కార్డు ఉన్న వారికి ఉచితంగా 4 గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి, అట్టడుగు వర్గాల ప్రజలు, మహిళలకు ప్రధాని మోదీ అండగా ఉంటారన్నారు. ఒక వర్గానికి రిజర్వేషన్లు 4 నుంచి 12 శాతానికి పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ వర్గం రిజర్వేషన్లు తొలగించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలకు ఇస్తామన్నారు.
- పదేళ్లలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని,

అమరవీరుల త్యాగాలపై ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. జాతీయ రహదారులను ప్రధాని మోదీ మంజూరు చేస్తే రాష్ట్రంలో కేసీఆర్ ఆపుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై విచారణ చేపడుతామన్నారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసిఆరు నెలల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జాతీయ రహదారులను ప్రధాని మోదీ మంజూరు చేస్తే రాష్ట్రంలో కేసీఆర్ ఆపుతున్నారని విమర్శించారు. రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందిస్తామని, వరికి క్వింటాలుకు రూ.3100 చెల్లిస్తామన్నారు. పసుపునకు మద్దతు ధర కల్పిస్తామని, పెళ్లి కాని ఆడపిల్లలకు రూ.2లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ కమీషన్ల వల్లే రాష్ట్రం ఆర్థికంగా వెనకపడి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

- బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై విచారణ చేపడుతామన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు రాష్ట్రంలో ఉంటే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందువల్ల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో అర్బన్‌లో ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్‌లో దినేశ్ కులాచారికి ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ రూరల్ అభ్యర్థి దినేశ్ కులాచారి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటరమణి, క్లాం బాల్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, నాయకులు, కార్పొరేటర్లు లక్ష్మీనారాయణ, వెంకటేష్, న్యాలం రాజు, గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, కిషన్ నాయక్, లింగంపల్లి లింగం, బీఆర్ శివప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు బిచ్కుందకు రేవంత్‌రెడ్డి రాక

బిచ్కుంద: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం బిచ్కుందకు రానున్నారు. ఉదయం 10 గంటలకు మండలకేంద్రంలో నిర్వహించే పార్టీ ప్రచార సభలో ఆయన పాల్గొంటారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

దోమకొండలో రోడ్‌షో..
దోమకొండ: మండల కేంద్రంలో శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రోడ్‌షో ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కార్నర్ మీటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎల్లారెడ్డి రూపురేఖలు మారుస్తా

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా
- రైతుల సాగునీటి కష్టాలు తీరుస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కె.మదన్‌మోహన్‌రావు

"ఏ పదవిలో లేనప్పుడే ప్రజల కోసం ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టా. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నా. ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతా" అని ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం ఆయన 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

– సాక్షి, కామారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ ఉంది. ప్రచారానికి వెళ్లిన ప్రతిచోటా నాకు మంచి ఆదరణ లభిస్తోంది. నామీద నమ్మకంతో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దీనిని చూస్తుంటే భారీ మెజారిటీతో విజయం సాధిస్తానన్న ధీమా ఏర్పడింది.

యువత కోసం..
నిరుద్యోగ యువతీయువకులు ఎంతోమంది ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వారికోసం ఉద్యోగ మేళా నిర్వహించి ఎంతో మందికి ఉద్యోగాలు ఇప్పించాను. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తా. నియోజకవర్గానికి వివిధ సంస్థలను తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా. ఉపాధి కల్పించే పరిశ్రమలు తీసుకువస్తా. పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి కావలసిన సహకారం అందిస్తా.

రైతుల కష్టాలు తీర్చేందుకు..
నియోజకవర్గంలో 95 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. కనీసం పండించిన పంటను దాచుకునేందుకు గోడౌన్‌లు లేవు. పంట నూర్పిడికి కల్లాలు లేవు. అలాగే కోల్డ్ స్టోరేజీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడ్డప్పుడు పంట వరదలపాలై నష్టపోతున్నారు. అందుకే రైతులకు ఉపయోగపడే విధంగా సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటా.



కాళేశ్వరం 22వ ప్యాకేజీ...
సాగునీటి సమస్యతో సతమతమవుతున్న నియోజకవర్గంలోని రైతులకు సాగునీరందిచడానికి ఉద్దేశించిన కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటాం. భూంపల్లి, కాటేవాడి తదితర రిజర్వాయర్లు నిర్మిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. అవన్నీ పూర్తి చేయడానికి కృషి చేస్తా.

విద్య, వైద్య రంగాలకు..
నియోజకవర్గంలో ప్రజలకు కావలసిన వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారికి కావలసిన ఆధునిక సౌకర్యాలు కల్పించి వైద్య సేవలు స్థానికంగా అందేలా చర్యలు తీసుకుంటా. విద్యాసౌకర్యాలు లేక చాలా మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. వారికి కావలసిన కాలేజీలు, స్కూళ్లు ఏర్పాటు చేయడంతో పాటు మౌలిక సదుపాయలు కల్పించి విద్యాభివృద్ధికి దోహదపడతా.

పక్కా ప్రణాళికతో అభివృద్ధి..
దశాబ్దాలుగా వెనకబడిన ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నదే నా లక్ష్యం. దానికి తగిన ప్రణాళిక నా వద్ద ఉంది. కచ్చితంగా నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే పనులన్నీ చేసి, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. ఎవరి వద్దా నయా పైసా తీసుకోకుండా సేవ చేస్తానని ప్రజలకు బాండ్ పేపర్ రాసిచ్చా. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా.

తెలంగాణలో కాంగ్రెస్‌దే గెలుపు

- బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మకండి
- పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

కామారెడ్డి టౌన్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీగా సీట్లు సాధించి అధికారంలోకి రావడం ఖాయమని పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నియోజకవర్గ పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. దళితుడిని సీఎం చేస్తానని చెప్పి మాట తప్పిన కేసీఆర్‌కు కామారెడ్డిలో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో సచివాలయానికి వెళ్లకుండా ఇంటి నుంచి పని చేసే ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బాగుపడ్డది కేసీఆర్ కుటుంబమేనన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీని ప్రజలు నమ్మే ప్రసక్తి లేదన్నారు. సీఎం కేసీఆర్ నుంచి కామారెడ్డిని కాపాడటానికి వచ్చిన రేవంత్‌రెడ్డికి భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు పండ్ల రాజు, గడ్డం చందు, గోనె శ్రీనివాస్, క్యాతం సిద్ధి రాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ



సదాశివనగర్ : మండలంలోని ఉత్తునూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా టీబీ ప్రోగ్రామ్ అధికారి మోహన్‌బాబు తనిఖీ చేశారు. టీబీ శాంపిల్స్‌ను పరిశీలించారు. డీపీసీ నీలిమ, టీబీ సూపర్‌వైజర్స్ శరత్, సంతోష్, నహీం, ఎల్టీ విఠల్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



పిట్లం : ప్రభుత్వ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీలత పేర్కొన్నారు. ఆమె గురువారం మండలంలోని రాంపూర్, కుర్తి పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. కుర్తి పాఠశాల హెచ్‌ఎం రవీందర్, సిబ్బంది శ్రీదేవి, కృష్ణమూర్తి, ఇస్మాయిల్, సీఆర్‌పి గోపాల్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



కామారెడ్డి అర్బన్: ఓటు హక్కు వినియోగంపై కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు గురువారం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ హెల్ప్‌లైన్, సి విజిల్ యాప్‌ల గురించి వివరించారు. తప్పని సరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. స్వీప్ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం రామస్వామి పాల్గొన్నారు.

ఈవీఎంలు సిద్ధం



మద్నూర్: ఎన్నికల కోసం అధికారులు ఈవీఎంలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన ఈవీఎంలను గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి మను చౌదరి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముజీబ్ పరిశీలించారు. జుక్కల్ బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఈవీఎంలో పొందుపర్చే పనిలో అధికారులు, సిబ్బంది ఉన్నారని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ముజీబ్ తెలిపారు.

ఇబ్రహీంపేట్‌లో ఇరువర్గాల ఘర్షణ

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రహీంపేట్‌లో గురువారం రాత్రి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి చేరుకున్న కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రసంగిస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. అసత్య ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతున్నారని, అబద్దపు మాటలు మానుకోవాలని నినాదాలు చేశారు. ఇరుపార్టీల నాయకులు పరస్పరం నినాదాలు చేసుకుని నెట్టుకోవడంతో పోలీసులు ఆందోళన కారులను శాంతింపచేశారు.

మంత్రిగా ఒకే ఒక్కడు

- కామారెడ్డి నుంచి రెండు సార్లు కేబినెట్ మంత్రిగా పనిచేసిన షబ్బీర్ అలీ
- ఇతర నేతలకు దక్కని అవకాశం



కామారెడ్డి క్రైం: కామారెడ్డి నియోజకవర్గం నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకుని రెండు పర్యాయాలు మంత్రిగా పని చేసిన ఘనతను షబ్బీర్ అలీ సొంతం చేసుకున్నారు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన మరెవరికీ ఇప్పటివరకు కేబినెట్‌లో మంత్రిగా పనిచేసే అవకాశం దక్కలేదు. ఇక్కడ నుంచి మంత్రి పదవిలో కొనసాగిన ఒకే ఒక్కడుగా చెప్పవచ్చు. గతంలో ఆయన రెండు పర్యాయాలు మంత్రిగా పని చేయడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో కీలకనేతగా ఉన్నారు. జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన నిజామాబాద్ అర్బన్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. అక్కడ నుంచి పోటీ చేసినా పార్టీ అధికారంలోకి వస్తే మూడోసారి మంత్రి పదవిలో గానీ, మరేదైనా ఉన్నత పదవిలోగానీ ఉండటం ఖాయంగా కనిపిస్తోంది.

కామారెడ్డి నియోజకవర్గానికి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. మొత్తం 11 మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వీరిలో ఒక్క షబ్బీర్ అలీని మాత్రమే మంత్రి పదవి వరించింది. యువజన కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన షబ్బీర్‌అలీకి కామారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ టికెట్ కేటాయించింది. టీడీపీ అభ్యర్థి యూసుఫ్‌అలీపై భారీ మెజార్టీతో గెలుపొంది అప్పటి వరకు నియోజకవర్గంలో కొనసాగుతున్న తెలుగుదేశం హవాకు ఆయన బ్రేకులు వేశారు. అంతేగాకుండా తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన షబ్బీర్‌అలీ తన 37వ ఏటనే మర్రి చెన్నారెడ్డి కేబినెట్‌లో మంత్రి అయ్యారు. మైనార్టీ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. అప్పటి నుంచే జాతీయ స్థాయిలో పార్టీ ప్రముఖులతో సంబంధాలు పెరిగాయి. ఏఐసీసీలోని ముఖ్యనేతలతో నేరుగా సంబంధాలు కలిగిన నాయకునిగా పేరు సాధించారు. 2004లో మరోసారి షబ్బీర్‌అలీ భారీ విజయం సాధించి అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో విద్యుత్‌శాఖ మంత్రిగా పనిచేశారు.

మరోసారి గెలిస్తే...

రెండుసార్లు కేబినెట్ మంత్రిగా పని చేసిన షబ్బీర్ అలీ జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిని వదిలి ప్రస్తుతం నిజామాబాద్ అర్బన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. పలుసార్లు అదృష్టం కలిసిరాకపోయినా ఈ సారి మాత్రం ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో షబ్బీర్‌అలీ, ఆయన అనుచర వర్గం పని చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే మరోసారి ఉన్నత పదవిలో చూడవచ్చని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

నేతల అడ్డా.. తాడ్వాయి గడ్డ

- దేమె, ఎర్రపహాడ్ నుంచే పలువురు అభ్యర్థులు
- నాలుగుసార్లు గెలుపొందిన రవీందర్‌రెడ్డి



ఏనుగు రవీందర్‌రెడ్డి



మదన్ మోహన్‌రావు



కాటిపల్లి వెంకటరమణారెడ్డి

ఎల్లారెడ్డి: ఉమ్మడి జిల్లా రాజకీయ పటంలో ఏ ప్రాంతానికి దక్కని స్థానం తాడ్వాయికి ఉంది. ఈ మండలం నుంచే అధిక సంఖ్యలో ఎమ్మెల్యే పదవి కోసం పోటీ పడ్డ నాయకులే ఎక్కువ మంది ఉన్నారు. ఎన్నికల్లో గెలిచి ప్రజా సమస్యలను పరిష్కరించాలనే తపన తాడ్వాయి నాయకుల నుంచే పుట్టిందని చెప్పవచ్చు. దీంతో మండలం నేతల అడ్డా.. తాడ్వాయి గడ్డగా మారింది. ఒకప్పుడు నియోజకవర్గంలో ప్రముఖుడైన కాటిపల్లి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, పైల కృష్ణారెడ్డి, మర్రి రాంరెడ్డి, రాజకీయాలపై ఆసక్తి ఉన్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి, నాటి టీడీపీ నాయకుడు చుక్క లక్ష్మాగౌడ్ లాంటి రాజకీయ నాయకులందరి సొంత మండలం తాడ్వాయి. వీరందరూ ఎమ్మెల్యే పదవికీ పోటీ చేసిన అభ్యర్థులే..

దేమె నుంచి మొదలు..

ఒకప్పుడు బాలాగౌడ్, కిషన్‌రెడ్డిలపై ఎమ్మెల్యే ఎలక్షన్‌లలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కాటిపల్లి రాజిరెడ్డి (దేమె) నుంచి మొదలుపెడితే నేటి ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు వరకు పైన చెప్పిన నాయకులందరి కేరాఫ్ అడ్రస్ తాడ్వాయి మండలమే. వీరిలో ఏనుగు రవీందర్‌రెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా మిగితా నాయకులందరూ ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానం కోసం పోటీ పడ్డవారే. మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డిది మండలంలోని ఎర్రపహాడ్ స్వగ్రామం కాగా, బీజేపీ నేత బాణాల లక్ష్మారెడ్డి స్వగ్రామం ఎండ్రియాల్, 2009లో కామారెడ్డి అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి ప్రస్తుతం పలు పార్టీల్లో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నిస్తున్న పైల కృష్ణారెడ్డిది కూడా ఎర్రాపహాడ్ గ్రామం. 2009 ఎన్నికలలో లోక్ సత్తా పార్టీ నుంచి పోటీ చేసిన మర్రి రాంరెడ్డిది మండలంలోని కనకల్ గ్రామం. ఇక మండలంలోని దేవాయిపల్లికి చెందిన పైడి ఎల్లారెడ్డి నాటి టీడీపీ హయాం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. కాటిపల్లి రాజిరెడ్డి కుమారుడు కాటిపల్లి రమణారెడ్డిది మండలంలోని దేమె గ్రామం. ఒకప్పుడు టీడీపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీ చేసిన తూనికలు కొలతల రిటైర్డ్ అధికారి చుక్క లక్ష్మాగౌడ్‌ది దేమె గ్రామం. నేడు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న మదన్‌మోహన్ రావు కూడా తాడ్వాయి మండలంతో తనకు అనుబంధం ఉందని అంటున్నారు. తన తండ్రి రాజేశ్వర రావు ఎర్రాపహాడ్‌లో టీచర్‌గా పనిచేశారని తన ప్రాథమిక విద్య ఎర్రాపహాడ్‌లోనే కొనసాగిందని చెప్పారు. ఇలా ఎల్లారెడ్డి రాజకీయాలను మలుపు తిప్పుతున్న నేటి రాజకీయ ముఖ్య నాయకులందరూ తాడ్వాయి మండలానికి చెందిన వారే కావడం విశేషం. గెలుపు ఓటముల సంగతి పక్కన పెడితే తాడ్వాయి గడ్డ.. నేతల అడ్డా అని ఇక్కడి చోటా మోటా నాయకులు అంటుంటారు.

అభివృద్ధి చేసి ఓట్లడుగుతున్నా..

- బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బీర్కూర్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

బాన్సువాడ: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రూ.11 వేల కోట్లతో అభివృద్ధి చేశానని ఎన్నికల్లో తనను ఆదరించాలని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. బీర్కూర్ మండలంలోని దామరంచ, రైతునగర్, అన్నారం, సంబాపూర్, బరంగెడ్డి, బైరాపూర్, బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం ప్రచారం నిర్వహించారు. పదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రంలో రైతు బంధు, రైతు బీమా, డబుల్ బెడ్ రూం ఇళ్లు, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలు లేవని తెలంగాణ వచ్చాకే ఈ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. మంజీర నదిపై చెక్‌డ్యాంలను నిర్మించామని, భవిష్యత్‌లో కరెంటు కొరత లేకుండా ఉండేందుకు కొల్లూర్‌లో రూ.90 కోట్లతో 220కేవీ సబ్‌స్టేషన్, కోటగిరిలో రూ.20 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం బీర్కూర్‌లో వివిధ కుల సంఘాల సభ్యులు పోచారంకు మద్దతు తెలిపారు. ప్రచారాల్లో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ జెట్పీటీసీ ద్రోణవల్లి సతీశ్, ఎంపీపీ రఘు, వైస్ ఎంపీపీ కాశీరాం, జెట్పీటీసీ స్వరూప, ఎంపీటీసీ సందీప్, సర్పంచులు కృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు, సాయిలు, అవారి గంగారాం, సాయిలు, శశికాంత్, దుంపల రాజు, ఆరీఫ్, మన్నన్, పోగు నారాయణ, పర్తు నారాయణ, యాట వీరేశం తదితరులు పాల్గొన్నారు.

‘అభివృద్ధికి కేరాఫ్ కేసీఆర్’



బస్వాపూర్‌లో డోల్ వాయిస్తున్న గంప గోవర్ధన్



బస్వాపూర్‌లో గజమాలతో గంప గోవర్ధన్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

భిక్కనూరు: అభివృద్ధికి కేరాఫ్ సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. గురువారం బస్వాపూర్, బాగిర్తిపల్లి, ఇసన్నపల్లి, కంచర్ల, మల్లుపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంప మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటే కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరు కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమాలలో ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు మంజుల, లలిత, రాములు, నాయకులు మహేందర్‌రెడ్డి, పాల రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పీపుల్స్ జేఏసీ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ జి జగన్నాథం, కో కన్వీనర్ వీఎల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కామారెడ్డి ప్రాంత అభివృద్ధి కోసం పాటుపడే రాజకీయ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 22 పనులను వెంటనే చేపట్టి 3.20లక్షల ఎకరాల భూమి సాగులోకి తేవాలన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. మొక్కజొన్న ఆధారిత ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి ప్రాంతంలో బెల్లం తయారీపై ఆంక్షలు ఎత్తివేయాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇల్లు లేని పేదలకు గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలన్నారు. కె వేణుగోపాల్, కె రమణ, శ్యామ్‌రావు, జడల రజనీకాంత్, లక్ష్మణ్ యాదవ్, మాయా సురేష్ పాల్గొన్నారు.

అపరాధ రుసుముతో 6 వరకు గడువు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో డిసెంబర్6 వరకు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి భరత్‌రాజ్ కోరారు. డిసెంబరులో నిర్వహించే 1వ సెమిస్టర్ (రెగ్యులర్), 1 నుంచి 6 సెమిస్టర్ల (బ్యాక్‌లాగ్) బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ పరీక్షల ఫీజు చెల్లింపు డిసెంబర్ 2 వరకు, రూ. వంద అపరాధ రుసుముతో డిసెంబర్ 4, రూ. 200 అపరాధ రుసుంతో 6లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల వెబ్‌సైట్ https://gdets.cgg.gov.in/ nizamabad. edu నుం సందర్శించాలని కోరారు.

తెయూ హాస్టల్ తనిఖీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఓల్డ్ బాయ్స్ హాస్టల్‌ను రిజిస్ట్రార్ యాదగిరి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నచ్చే విధంగా వంటలు చేయాలన్నారు. అనంతరం హాస్టల్లో విద్యార్థులతో కలిసి రిజిస్ట్రార్ యాదగిరి, చీఫ్ వార్డెన్ మహేంద్ర ఐలేని, పీఆర్‌ఓ పున్నయ్య భోజనం చేశారు.

మిషన్ కాకతీయతో గంగపుత్రలకు లబ్ధి

ఎమ్మెల్సీ కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఆర్మూర్: మిషన్ కాకతీయ పథకంతో గంగపుత్రులు లాభపడ్డారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద గురువారం నిర్వహించిన గంగపుత్రల ఆత్మీయ సమ్మేళనానికి కవిత హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక గంగపుత్రులను గుర్తించింది సీఎం కేసీఆరే అని అన్నారు. ఎక్కడ చూసినా చెరువులు నిండు కుండల్లా ఉన్నాయని దీంతో చేపల పెంపకం పెరిగిందన్నారు. తెలంగాణలో ఉన్న గంగపుత్రులే దేశానికి ఆదర్శంగా ఉన్నారని ఈ ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. సమ్మేళనంలో జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, గంగపుత్ర సంఘం సభ్యులు బట్టు నరేందర్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సౌదీలో రాజఖాన్‌పేట వాసి మృతి



నరసింహచారి(ఫైల్)

మాచారెడ్డి: బతుకు దెరువు నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లిన ఓ వ్యక్తి గుండె పోటుతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాజఖాన్‌పేట గ్రామానికి చెందిన సుంకోజు నర్సింహచారి (55) ఏడేళ్ల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. ఈ నెల 19న ఛాతిలో నొప్పంటు కుప్పకూలాడు. వెంటనే అక్కడున్న అతని స్నేహితులు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం స్పందించి నరసింహచారి మృత దేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

రుద్రూర్: కోటగిరి మండలం వల్లాభపూర్ గ్రామానికి చెందిన నాచుపల్లి చిరంజీవి (34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోదరిని పరామర్శించి వస్తానని చెప్పి బుధవారం వెళ్లిన చిరంజీవి ఇంటికి చేరుకోలేదు. పోతంగల్ మండలం టాక్లీ గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందినట్లు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిరంజీవి కాళ్లు భూమికి తగులుతున్నాయని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తన భర్తను హత్య చేసి ఉంటారని భార్య లక్ష్మి అనుమానం వ్యక్తం చేసింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

రామారెడ్డి: భార్య కాపురానికి రావడంలేదనే మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. తాడ్వాయి మండలం సంతాయిపేటకు చెందిన మ్యాదరి భాస్కర్ (33) అన్నారం గ్రామానికి చెందిన అనితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి మధ్య గొడవలు కావడంతో అనిత అక్టోబర్ 30న తల్లిగారింటికి వెళ్లింది. కాపురానికి రావాలని పలుమార్లు భాస్కర్ విన్నవించినా రాకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని తల్లి విజయకు భాస్కర్ తెలుపగా వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో..

రామారెడ్డి: వడ్లకుప్ప వద్ద జరిగిన గొడవలో ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ గురువారం తెలిపారు. రెడ్డిపేటకు చెందిన ఎంబరి లింబాద్రి (29) బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన వ్యక్తితో వడ్లకుప్ప వద్ద గొడవ జరిగింది. గొడవను మనసులో పెట్టుకొని మనస్తాపానికి గురైన లింబాద్రి గురువారం తాను ఉరేసుకొని చనిపోతున్నట్లు భార్యకు ఫోన్ చేసి తెలిపాడు. వెంటనే భార్య లావణ్య గ్రామస్తులతో కలిసి అక్కడి వెళ్లగా అప్పటికే లింబాద్రి మృతి చెందాడు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో పలువురు వ్యక్తుల నుంచి రూ.1,58,600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటన స్థలిలో బాధితులు

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువ మూల మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వర్ని నుంచి బాన్సువాడ వైపు బైక్‌పై వెళ్తున్న సాకలి తుకారాం, భూలక్ష్మిలను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ ఢీకొన్నది. ఈ ఘటనలో వారికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నగేశ్ (ఫైల్)

నిజాంసాగర్/ బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలం పెదవాగు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎరుకల నగేశ్ (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో మహేందర్‌రెడ్డి తెలిపారు. మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన నగేష్ బాన్సువాడ నుంచి స్వగ్రామానికి వస్తుండగా ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బాలుడి మృతిపై విచారణ



విచారణ చేపడుతున్న నసీమా సుల్తానా

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద మృతి చెందిన బాలుడు చందు(5) ఘటనపై ఆర్మూర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నసీమా సుల్తానా గు రువారం విచారణ చేపట్టారు. ఇత్వార్‌పేట్‌లో ఉన్న ఇటుక బట్టీలో ఏపీలోని నెల్లూర్ జిల్లాకు చెందిన నరేశ్ కూలీగా పనిచేస్తున్నాడు. అతని కుమారుడు చందుకి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయమై జడ్జి ఇటుక బట్టి వద్ద విచారణ చేపట్టారు. బట్టి యజమాని సకాలంలో డబ్బులు ఇవ్వలేదనే ఆరోపణలు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు సరైన వసతి లేక పోవడంపై మండిపడ్డా రు. ప్రతి వారం లేబర్ కమిషనర్ పర్యవేక్షించాలన్నారు. మైనింగ్ అధికారులు సరైన చర్యలు తీసుకో వాలన్నారు. మృతుడి కుటుంబానికి తన వంతు సహాయంగా నిత్యావసర సరుకులను అందజేశా రు. జడ్జి వెంట తహసీల్దార్ శ్రీధర్ ఉన్నారు.

పలు గ్రామాల్లో మద్యం పట్టివేత

- మద్యం బాటిళ్లు, కారు సీజ్
- సింగిల్ విండో చైర్మన్‌పై కేసు నమోదు



భిక్కనూరులో స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

భిక్కనూరు: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సింగిల్ విండో చైర్మన్ గంగల్ల భూమయ్య కారును తనిఖీ చేయగా అందులో 864 మద్యం క్వార్టర్ సీసాలు లభ్యమైనట్లు చెప్పారు. మద్యం సీసాలను పట్టుకున్న సందర్భంలో విండో చైర్మన్, బీజేపీ శ్రేణుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు కారు, మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. విండో చైర్మన్ భూమయ్యతో పాటు సిద్దరామేశ్వర వైన్‌షాప్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాటాపూర్‌లో..

రెంజల్: సాటాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న తెలిపారు. ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ జగన్, కానిస్టేబుళ్లు లక్ష్మణ్, మంజుల ఉన్నారు.

జంగంపల్లిలో

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన సంతోష్, రామస్వామి వద్ద మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.